# స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ వేడుకలలో...
# "సత్యశోధక్" విద్యార్థుల ప్రతిభ.








**రాష్ట్ర స్థాయి 'కలర్ పార్టీ'లో ప్రథమ స్థానం.**
**క్యాంప్ క్రాఫ్ట్, ఎగ్జిబిషన్, భౌతిక, సాంస్కృతిక ప్రదర్శనలో ఉత్తమ గ్రేడ్ అవార్డులు.**
**రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఎంపీ ఈటల రాజేందర్ అభినందన.**
**ఆనందం వ్యక్తం చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.**




**వేగుచుక్క న్యూస్, సిరికొండ, నవంబర్ 12:**

హైదరాబాద్ లో 75 వసంతాల స్కౌట్స్ అండ్ గైడ్స్ 'డైమండ్ జూబ్లీ' వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ప్రధాన కార్యాలయంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు వివిధ పోటీల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమాల్లో నిజామాబాద్ జిల్లా తరపున స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె. సాల్మన్, గైడ్ కెప్టెన్ వనిత ఆధ్వర్యంలో పాల్గొన్న సిరికొండలోని సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు వివిధ అంశాలలో అద్భుత ప్రతిభ కనబరిచి ఉత్తమ గ్రేడ్, అవార్డులు సాంధించారు. సత్యశోధక్ పాఠశాలకు చెందిన 16మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు డి. శ్రీనాథ్, పి. వర్షిత్, ఎ. శ్రీకాంత్, జి. కార్తీక్, జి. అద్వైత్ రెడ్డి, ఆర్. శ్రీశాంత్, యం. శ్రీవర్ధన్, ఎ. రమనీష్ పాల్గొన్నారు. అలాగే గైడ్స్ సి.ఎచ్. కృతిక, బి. భవ్యశ్రీ, డి. శ్రీజ, యన్. స్నితిక, బి. నిధి, బి. పల్లవి సి.ఎచ్. ప్రణవి, జి. సంవిధలు 8 మంది పాల్గొన్నారు. ఈ వేడుకలలో కలర్ పార్టీలో మొదటి స్థానంతో పాటు క్యాంప్ క్రాఫ్ట్, ఎగ్జిబిషన్, భౌతిక మరియు సాంస్కృతిక ప్రదర్శనలో ఏ గ్రేడ్ అవార్డులు సాధించారు. పాఠశాలకు చెందిన బి. శ్రీజ, డి. శ్రీకాంత్ లకు పథకావిష్కరణ చేసే అరుదైన అవకాశం పొందారు. మూడు రోజులుగా జరిగిన ఈ వేడుకలలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ముషీరాబాద్ శాసన సభ్యులు ముఠాగోపాల్, విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం తో పాటు రాష్ట్ర స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, పరమేశ్వర్, ప్రమోదిని తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభా నైపుణ్యలను వారు ప్రశంషించారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవ 'డైమండ్ జూబ్లీ వేడుకల'లో నిజామాబాద్ జిల్లా తరపున పాల్గొని వివిధ విభాగాలలో అవార్డులు, ఉత్తమ గ్రేడ్ లు సాధించడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ఆనందాన్ని వ్యక్తం చేశారు. సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ సిబ్బందికి ఆయన అభినందనలు తెలపారు.




## ట్రిపుల్ ఐటి విద్యార్థి ఆత్మహత్యపై సీబీఐ విచారణ జరిపాలి.

### - పిడిఎస్ యూ, పివైఎల్ డిమాండ్

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 12:**

బాసర ట్రిపుల్ ఐటీ లో పియుసి రెండవ సంవత్సరం చదువుతున్న స్వాతి ప్రియ ఆత్మహత్యపై సిబిఐ విచారణ జరిపాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పివైఎల్ జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం డిమాండ్ చేశారు. నగరంలోనీ కోటగల్లిలో గల నీలం రామచంద్రయ్య భవన్ లో మంగళవారం విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగ బాసర ట్రిపుల్ ఐటీ లోనే ఎందుకు విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నాయో విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. గత కొన్ని నెలల క్రితం అరవింద్, శిరీష, బబ్లూ, దీపిక అనే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రతి విద్యా సంవత్సరంలో పదుల సంఖ్యలో విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థుల ఆత్మహత్యలకు కారణాలను ప్రభుత్వం బయట పెట్టకుండా, ప్రతి ఆత్మహత్యకు వ్యక్తిగత కారణాలను జోడించి చూపిస్తున్నారని, విద్యార్థులతో మాట్లాడనివ్వకుండా, క్యాంపస్ లో విద్యార్థి సంఘాలను అడుగు పెట్టకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. విద్యార్థుల ఆత్మహత్యల కారణాలు తెలుసుకోవడానికి గత సంవత్సరం రేవంత్ రెడ్డి గోడ దూకి లోపలికి పోయారని, వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలపై సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ, పివైఎల్ నాయకులు గొంట్యల రమేష్, దేవిక, భాస్కర్, నిఖిల్, రాజు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఏడాది పాలన ప్రజా వంచనే.

- **హామీలు అమలు చేయకుండానే ఉత్సవాల.**
- **ఏం మొఖం పెట్టుకొని ప్రజల ముందుకొస్తారు.**
- **నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ విమర్శలు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 12:**



కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన అంత ప్రజా వంచనకే సరిపోయిందని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామి అమలు చేయకుండానే ఉత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త విమర్శించారు. బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 26 రోజుల విజయోత్సవాలు జరుపుకోవడానికి సిగ్గుండాలని అన్నారు. తెలంగాణ సమాజం మొత్తం కాంగ్రెస్ ఏడాది పాలన చూసి అసహ్యించుకుంటున్నారని, 6 నెలలకే కాంగ్రెస్ పార్టీ పైన నమ్మకం కోల్పోయి 8 పార్లమెంట్ స్థానాలలో బిజెపిని గెలిపించడం జరిగిందన్నారు. ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ఈ రోజు ఏ మొఖం పెట్టుకొని ఉత్సవాలు అని వస్తున్నారని ప్రశ్నించారు.రైతన్నలకు రుణమాఫీ కాకా పండించిన పంటలు కల్లాలలో ఉండి అకాల వర్షానికి నష్టపోతున్నందుకు కాంగ్రెస్ సంబరాలు చేసుకుంటుందా అని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద 2500 ఇచ్చినావా, అవ్వ, తాతలకు పెన్షన్ 4వేలకు పెంచినావా, గరిబోళ్లకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిచ్చినావా, యువ వికాసం పథకం కింద విద్యార్థులకు విద్య భరోసా 5లక్షలు ఇచ్చినావా, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 4వేలు ఇస్తున్నావా, ఆడపిల్లలకు ఎలక్ట్రికల్ స్కూటీ, పెళ్ళైన మా ఆడబిడ్డలకు తులం బంగారం ఇచ్చినావా... ఏమీ అమలు చేయని మీకు ఉత్సవాలు ఎందుకని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో ఇచ్చిన గ్యారంటీలను, హామీలను డైవర్ట్ చేసే ప్రయత్నం చేస్తూన్నారని, సర్వేలో కుల గణన తో పాటు ఆస్తుల వివరాలు ఎందుకు అడుగుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల ఆస్తుల, వారి జీతాబత్యాల వివరాలు తెలుసుకునే ముందు దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నాయకుల ఆస్తుల పైన, జీతాబత్యాల పైన శ్వేతపత్రం విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. సర్వేకు బిజెపి వ్యతిరేకం కాదని, కానీ తీసుకొనే వివరాలే అభ్యంతరకరంగా ఉన్నాయని అన్నారు. కుల గణన పేరుతో ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు కాలయాపన చేస్తే నిలదీస్తామని హెచ్చరించారు.అంతే కాని కులగణన పేరుతో, కుటుంబ సర్వే పేరుతో, మి సోనియామ్మ జన్మదినం పేరుతో కాలయాపన చేస్తే మేము చూస్తూ ఊరుకోము మీరు ఇచ్చిన గ్యారంటీలు, హామీలు అమలు చేసేవరకు విడిచిపెట్టేది లేదు అని హెచ్చరించారు.